క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున ఏపీడీ

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ నరసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు పనుల వద్దకు సరైన సమయానికి చేరుకోవాలన్నారు. వడ దెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలన్నారు. పనులు త్వరగా ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోవాలన్నారు. ఉపాధి సిబ్బంది పనుల వద్ద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అవసరమైన అందరికీ పనులు కల్పించాలన్నారు. ఏపీడీతో పాటు ఏపీఓ శ్రీవిద్య, పీఎస్ సుబ్బమ్మ, టీఏలు కొండారెడ్డి, శ్వేత తదితరులు ఉన్నారు.

శుభకార్యం



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్ : పట్టణానికి చెందిన నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి కుమార్తె రాగిణి వివాహం హైదరాబాద్ గచ్చిబౌలిలోని శ్రీసంధ్యా కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కోడలు మేధాశ్రీరెడ్డిలతో పాటు పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



జరిమానా విధిస్తున్న ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కూరగాయాల మార్కెట్‌లోని వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లపై తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ అనే వ్యాపారి వద్ద ప్లాస్టిక్ కవర్లు లభించడంతో అతనికి రూ.వెయ్యి జరిమానా విధించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ పల్లి విద్యార్థిని ప్రతిభ



లహరి

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన లహరి ఏపీఆర్‌జేసీలో ప్రతిభ చాటింది. 150 మార్కులకు గానూ 102 మార్కులతో రాష్ట్రస్థాయిలో 1,162 ర్యాంకును సాధించింది లహరిని హెచ్‌ఎం శ్రీధర్‌రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


ఏపీ రెసిడెన్సియల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



భవిష్య చౌదరి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం ప్రకృతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. గత నెల 25న జరిగిన ఏపీ రెసిడెన్సియల్ ప్రవేశ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థి భవిష్య చౌదరి 97 మార్కులు, విష్ణువర్దన్ రెడ్డి 95 మార్కులు సాధించారన్నారు. అలాగే 90 పైన మార్కులు వచ్చిన వారు 16 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు మంజుల, భాగ్యవతి అభినందించారు.

అనారోగ్యంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ప్యాపిలి: మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో రైతు మోహన్‌కు చెందిన ఆవు మృత్యువాత పడింది. గర్భంతో ఉన్న ఆవు బుధవారం అనారోగ్యానికి గురికాగా సచివాలయ వెటర్నరి అసిస్టెంట్‌కు సమాచారం ఇచ్చినట్లు రైతు తెలిపాడు. వెటర్నరి అసిస్టెంట్ ఆవును పరీక్షించేందుకు రాకపోగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడన్నారు. పరిస్థితి విషమించడంతో ఆవు మృతి చెందినట్లు రైతు వాపోయాడు. రైతు ఏడీ కిశోర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మారెమ్మా.. మన్నించు!

- కంపమల్ల మారెమ్మ ఆలయానికి రాజకీయ గ్రహణం
- కాల్వ పేరుతో రహదారిపై మట్టికట్టలు వేసిన టీడీపీ నాయకులు
- ఏడు నెలలుగా అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు కరువు
- ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో వెలసిన మారెమ్మ ఆలయానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. బీసీ కాలనీ ప్రజలపై గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధిస్తున్నారు. ఏడు నెలల క్రితం కాల్వ పేరుతో తవ్వకాలు జరిపి మట్టిని రహదారిపైనే కుప్పలుగా పోయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆలయానికి ధూపదీపనైవేద్యాలు కూడా నిలిచిపోయాయి. ఈ నెల 18 నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో మట్టి కుప్పలు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 1.30 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి 150 మీటర్ల మేర కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఈ రహదారి వెంటే గ్రామానికి చెందిన రైతులు, కాలనీ ప్రజలు పొలాలు, ఊరకుంట, మెయిన్‌రోడ్డుకు వెళ్లేవారు. ఈ రహదారిలోనే మారెమ్మ గుడి ఉంది. అయితే ఈ మార్గంలో గతంలో నిర్మించిన డ్రైనేజీకి కొనసాగింపుగా కాలువ నిర్మిస్తామని చెప్పి ఏడు నెలల క్రితం టీడీపీ నాయకులు తవ్వకాలు జరిపి మట్టిని రోడ్డుపై వేసి వదిలేశారు. మట్టికుప్పలు అడ్డుగా ఉండటంతో రాకపోకలు స్తంభించడంతో అమ్మవారు ధూప, దీప నైవేద్యాలను నోచుకోలేదు. ఆలయానికి మరో దారి లేకపోవడంతో భక్తులు ఆలయానికి వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది.

18 నుంచి 25 వరకు ఉత్సవాలు

భక్త మండలి వారు ఈ నెల 18వ తేదీన మారెమ్మ ఆలయంలో అఖండల పూజ, 25న బోనాల సమర్పణ, తదితర కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టారు. ఉత్సవాల ప్రారంభానికి మరో మూడు రోజులు మాత్రమే ఉండటంతో మట్టికుప్పలు తొలగిస్తారా లేదా అన్న సందిగ్ధత నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై అడ్డుగా పోసిన మట్టికప్పలను తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు. రోడ్డుపై మట్టికుప్పలు ఉన్న విషయాన్ని డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఈ రహదారిలో గ్రామ కుంట ఉందన్నారు. ఈ ప్రాంతమంతా మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని చెప్పారు. మట్టికట్టలు తొలగింపు విషయాన్ని ఆ శాఖ అధికారులకు తెలియజేస్తామన్నారు.



మారెమ్మ ఆలయం వద్ద రహదారికి అడ్డంగా వేసిన మట్టికుప్పలు

గజేంద్ర వాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగ విఠలేశ్వరుడు బుధవారం గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవరోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి స్వామి వాహన సేవల్లో చివరిదైన గజేంద్ర వాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఆయా కాలనీలకు చెందిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రథోత్సవం

పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో రథాన్ని ముస్తాబు చేస్తున్నారు. సాయంత్రం ఆలయం నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం పట్టణంలోని రంగరాజుపేట, సంతమార్కెట్, అమ్మవారి శాలమీదుగా గాంధీసెంటర్ వరకు కొనసాగుతుంది. రథోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలచే కోలాటం, కాళికాశక్తి, భద్రకాళి వేషాధారణ, భజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.



గజేంద్రవాహనంపై కనువిందు చేస్తున్న పాండురంగడు



ముస్తాబవుతున్న రథం

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పొదుపు మహిళలకు తడిచెత్త, పొడిచెత్త, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని చెత్త, చెదారం రోడ్లు, మురుగు కాల్వల్లో వేయకుండా ప్రతి ఇంటి వద్దకు వచ్చే క్లాప్‌మిత్రలకు అందజేసి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శేఖర్, సీసీలు వెంకటస్వామి, గోపాల్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

17న మండల స్థాయి అధికారులతో సమీక్ష

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17న మండల స్థాయి అధికారులతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని ఎంపీడీఓ ప్రసాదరెడ్డి బుధవారం తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. అలాగే మంత్రి కొలిమిగుండ్లలో జరిగే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా సప్తాహం

బేతంచెర్ల: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నుంచి 21వ తేదీ వరకు హనుమాన్ చాలీసా సప్తాహం నిర్వహించనున్నట్లు పూదోట ఆశ్రమ నిర్వాహకులు బుధవారం తెలిపారు. గొరిపేటలోని పూదోట ఆశ్రమంలో ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం 6.30 గంటలకు స్వామి వారికి సామూహిక అభిషేకం, అర్చన అనంతరం ఖమ్మం జిల్లాకు చెందిన సర్వలక్ష్మి బృందం వారి హనుమాన్ చాలీసా సంకీర్తన ప్రారంభమవుతుందన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయాలి

బనగానపల్లె రూరల్ : ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, అసంక్రమిత వ్యాధులను గుర్తించాలని రాష్ట్రీయ బాల స్వచ్ఛ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని టంగుటూరు, కై ప, మీరాపురం, తమ్మడపల్లె గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధుల గుర్తింపు (ఎన్‌సీడీసీడి 3.0) సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 3.0 సర్వేలో భాగంగా హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ సంబంధించిన పరీక్షలను పకడ్బందీగా చేయాలని, అవసరం ఉన్న పేషంట్స్ సంబంధిత వైద్యశాలకు సిఫార్సు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు ఉన్నారు.



తమ్మడపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్

నాటుసారా విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న కొత్తపల్లె బాలరాజు వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పెండేకంటి సుబ్రహ్మణ్యం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు అమ్మవారి వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు కృషి చేశారు. దీంతో 40 మందికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గోధుమపిండి, బెల్లం, నూనె, శనగ పప్పులు, తదితర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇస్కాల ప్రసాద్, నాగరాజు, పెండేకంటి విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి వ్యక్తి మృతి

మహానంది: మొక్కలకు నీళ్లు పడుతూ ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి గాజులపల్లెకు చెందిన మంటునూనె మహ్మద్ కాశీం(47) బుధవారం మృతిచెందాడు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మహ్మద్ కాశీం భార్య రహమ్మద్‌బీతో కలిసి బుక్కాపురం సమీపంలోని నంది ఫామ్ హౌస్‌లో మొక్కలకు నీళ్లు పట్టే పనిలో చేరారు. చెట్లకు నీళ్లు పోసే క్రమంలో కాశీం స్విమ్మింగ్ పూల్‌లో పడ్డాడు. అదే సమయంలో మూర్ఛ వ్యాధి రావడంతో బయటకు రాలేక మృతిచెందాడు. సూపర్‌వైజర్ వెంకటరెడ్డి గుర్తించి మృతుడి భార్యకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ.. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలవరంపై ఉన్న శ్రద్ధ శ్రీశైలం ప్రాజెక్ట్‌పై లేదు

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా

మహానంది: రాష్ట్రప్రభుత్వానికి పోలవరంపై ఉన్న శ్రద్ధ.. శ్రీశైలం ప్రాజెక్ట్‌పై లేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆరోపించారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మహానంది మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదలకు శ్రీశైలం ప్రాజెక్ట్ ప్లంజ్ పూల్ దెబ్బతిందన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు వెలుగులు పంచిన శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రతను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించి యుద్ధ ప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజా బహిరంగ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, సాగేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న బొజ్జా, రైతు సంఘం నాయకులు

కంజులకు భళే గిరాకీ!

డోన్: అడవి పక్షి అయిన కంజులకు భళే గిరాకీ ఉంది. ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు కంజులను పట్టి.. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జత రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. సాధారణంగా అడవి పక్షుల మాంసాన్ని ఇష్టపడే వ్యక్తులు వీటిని ఎగబడి కొనడం కనిపించింది.



గాంధీ సర్కిల్‌లో కంజులు విక్రయిస్తున్న దృశ్యం

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత

బొమ్మలసత్రం: హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం హోంగార్డ్ యూనిట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా హోంగార్డుల కవాతును పరిశీలించారు. కమాండెంట్ మాట్లాడుతూ ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, విపత్తులు సంభవించినప్పుడు హోంగార్డుల సేవలు ఎంతో ఉపయోగకరమన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా క్రమశిక్షణతో సిబ్బంది మెలగాలన్నారు. హోంగార్డులకు వ్యక్తిగత ప్రమాదబీమా పాలసీకి రూ.3.5 లక్షల కేటాయించామన్నారు. అనంతరం కవాతు, విధినిర్వహణలో ప్రతిభకనపరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కమాండెంట్‌తో పాటు హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, సురేష్‌బాబు, ఆర్‌ఎస్‌ఐ ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రం అందిస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

మున్సిపల్ ఆదాయం పెంచేందుకు కృషి

డోన్: పట్టణ ప్రజలకు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారుల్లాంటి మౌలిక వసతులు కల్పించేందుకు ఆదాయ వనరులను పెంపొందించుకోవాల్సినవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, డీఈ రఘు, ఏఈ సురేష్ తదితరులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ 1వ అంతస్తులో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు గదులను మరో పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఓపెన్ యాక్షన్ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తే అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైన హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

16న మున్సిపల్ శాఖ మంత్రి రాక

ఈనెల 16న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ డోన్ పట్టణానికి రానున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజేష్ తెలిపారు.



అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



ఆర్టీసీ బస్టాండు ఎదుట ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

రహదారిపై వర్షపునీరు

బేతంచెర్ల: పట్టణంలోని కొత్త బస్టాండు ఎదురుగా ఉన్న కర్నూలు–నంద్యాల ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు ప్రధాన రహదారిపై నిలిచిపోయింది. దీంతో బస్టాండులోకి వచ్చిపోయే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కౌలు గుర్తింపు కార్డు ఉంటేనే పథకాలు

బేతంచెర్ల: వ్యవసాయ శాఖ తరపున ప్రభుత్వ పథకాలు పొందాలంటే కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డు పొందాలని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని యంబాయి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవతో పాటు సబ్సిడీ, పంట రుణాలు, నష్ట పరిహారం, సున్నా వడ్డీ, పంటను మద్దతు ధరకు విక్రయించుకోవడం తదితర పథకాలు పొందేందుకు కచ్చితంగా కౌలు గుర్తింపు కార్డు పొందాలన్నారు. వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం రైతుల సందేహాలను వీఆర్వో మద్దయ్య, ఎంపీఈఓ స్వాతి నివృత్తి చేశారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వీఆర్వో



కొర్ర కంకులను కట్ట కడుతున్న మహిళలు

జోరుగా కొర్ర కోతలు

బేతంచెర్ల మండలంలోని ముద్దవరం, ముసలాయిచెర్వు, ఎం.పెండేకల్లు, అంబాపురం, ఆర్‌ఎస్ రంగాపురం, కొలుములపల్లె, గూటుపల్లె, రహిమానుపురం గ్రామాల పరిధిలోని బోరుబావుల కింద సాగైన కొర్ర పంట చేతికొచ్చింది. దీంతో రైతులు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. దాదాపు 200 ఎకరాలకు పైగా కొర్ర పంట సాగైనట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా కోత తర్వాత కట్ట కట్టి కుప్పకేసే పనుల్లో మహిళా కూలీలే అధికంగా కనిపిస్తున్నారు. 20 నుంచి 30 మంది మహిళలు జట్టుగా ఏర్పడి అవసరమైన రైతు పొలానికి పనుల నిమిత్తం వెళ్తూ ఉపాధి పొందుతున్నారు.

– బేతంచెర్ల

తాగునీరు కలుషితం



మురుగునీటిని చూపుతున్న కాలనీవాసులు



కుళాయి నుంచి సరఫరా అవుతున్న మురుగునీరు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో కుళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. దాదాపు 30 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో అవే నీటిని తాగుతూ రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఎర్రగుంట్ల రాజు, కిరణ్, నాగరాజు, రమేష్, నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి సరఫరా అయ్యే పైపులైన్ మురుగు కాల్వ కింద ఉండటంతో పైపు లీకేజీ అయి మురుగునీరు అందులోకి వెళ్తుందని తెలిపారు. ఇదే విషయాన్ని పలు మార్లు నగర పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ, పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.



జెడ్పీ హైస్కూల్ వద్ద ఈత పడ్లు విక్రయిస్తున్న గ్రామీణులు

ఈత పండ్లతో ఉపాధి

ఏ సీజన్ పండ్లు ఆ సీజన్‌లోనే తినాలంటారు పెద్దలు. ఐరన్, ఫైబర్ అధిక మోతాదులో లభించే సహజసిద్ధమైన ఈత పండ్లకు ఈ సీజన్‌లో భలే గిరాకీ ఉంది. కాగా కొందరు గ్రామీణ మహిళలు ఈ సీజన్‌లో ఇదే ఉపాధిగా ఎంచుకుంటున్నారు. డోన్ నియోజకవర్గం పరిధిలోని వంకలు, వాగుల వెంట ఉన్న ఈత చెట్ల నుంచి సేకరించిన పండ్లను డోన్ జెడ్పీ హైస్కూల్ వద్దకు తెచ్చి పడి రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన మహిళలు నంద్యాల, కర్నూలు, వినుకొండ, దొనకొండ, గుంతకల్లు తదితర పట్టణాలకు గంపల్లో తీసుకువెళ్లి ఆయా పట్టణాల్లో పడి రూ.100 చొప్పున విక్రయించుకుంటున్నారు.

– డోన్

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్(ఐఏఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్‌కు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.